క్లుప్తంగా

ప్రభుత్వ భూమి స్వాధీనం



బోర్డు ఏర్పాటుచేస్తున్న రెవెన్యూ అధికారులు

మణుగూరు టౌన్: మున్సిపాలిటీలోని రాజీవ్ గాంధీ నగర్ ప్రాంతంలో ప్రభుత్వ భూమిని కొందరు లారీలు నిలిపి ఆక్రమించుకుని లారీ యార్డ్‌గా వాడుకుంటున్న విషయం తెలుసుకున్న అధికారులు సదరు భూమిని శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాఘవరెడ్డి ఆర్ఐ, సిబ్బందితో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠినంగా వ్యవహరిస్తామని, రికార్డు అసిస్టెంట్లు ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తారన్నారు.

ఈఎల్‌టీఏ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మీరాహుస్సేన్



మణుగూరు రూరల్ : ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఈఎల్‌టీఏ) జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని కూనవరం ఎంపీయూపీఎస్ ఆంగ్ల ఉపాధ్యాయుడు షేక్ మీరాహుస్సేన్ ఎన్నికైనట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు షేక్ దస్తగిరి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా మీరాహుస్సేన్ మాట్లాడుతూ... అసోసియేషన్ బలోపేతానికి, ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

క్రీడా పోటీలను జయప్రదం చేయండి

అశ్వారావుపేటరూరల్: మండల, జోనల్ స్థాయి క్రీడా పోటీలను జయప్రదం చేయాలని అశ్వారావుపేట ఎంఈవో కీసరి లక్ష్మీ కోరారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో హెచ్‌ఎంలు, పీఈటీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల ప్రకారం మండల, జోనల్ స్థాయి క్రీడా పోటీలను సెప్టెంబర్ 10, 11, 12 తేదీల్లో స్థానిక వ్యవసాయ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు హాజరు కావాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చర్ల: చర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9.00 గంటల నుంచి 11.00 గంటల వరకు లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో చర్ల సెక్షన్ ఏఈ యోహాను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

'మహిళా శక్తి'తో ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న పశు వైద్యాధికారి శ్రీలత

కరకగూడెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహిళా శక్తి పథకం'తో మహిళా సంఘాల సభ్యులు ఆర్థిక అభివృద్ధి సాధించాలని కరకగూడెం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కుమార్, ఏపీఎం త్రిగుణ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళా శక్తి పథకానికి సంబంధించిన పలువురు లబ్ధిదారులకు గేదెలు, పెరటికోళ్ల పెంపకంపై అవగాహన నిర్వహించారు. పశు వైద్యాధికారి శ్రీలత కోళ్లు, పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో వైద్య శిబిరాలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: స్థానిక మహాత్మా జ్యోతిరావుపూలే బాలుర, బాలికల గురుకుల పాఠశాలల్లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. వినాయకపురం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరాల్లో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది రెష్మా, అరుణ, ప్రసాద్ పాల్గొన్నారు.

హై లెవల్ తిప్పలు..

వాగొడ్డుగూడెం వాగు పొంగితే అవస్థలు

- వానొస్తే రాకపోకలకు అంతరాయం
- ఎటు వెళ్లాలన్నా చుట్టూ తిరిగి రావాల్సిందే.!
- వంతెన నిర్మించాలని వేడుకోలు



వాగు ప్రవాహానికి నీటి మునిగిన లో లెవల్ చప్టా (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: వాగుపై హై లెవల్ వంతెన లేకపోవడంతో ప్రతీ ఏటా వర్షాకాలంలో తిప్పలు తప్పడం లేదు. వర్షం కురిసి వాగు పొంగితే చాలు గిరిజనులు అవస్థలు పడాల్సి వస్తోంది. ఏళ్లుగా వాగు పై హైలెవల్ వంతెన నిర్మించాలని కోరుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పదేళ్ల క్రితం లో లెవల్ చప్టా...

మండలంలోని వాగొడ్డుగూడెం గ్రామ శివారులో వాగుపై పంచాయతీ రాజ్ శాఖ నిధులతో లో లెవల్ చప్టాను నిర్మించారు. అప్పటి పరిస్థితులకు అనుగుణంగా చప్టాను నిర్మించగా, ప్రస్తుతం ఈ చప్టా వద్ద కొద్దిపాటి వర్షాలకే ఈ వాగు లో లెవల్ చప్టా నీట మునిగిపోతుంది. ఎగువ ప్రాంతంలో ఊట్లపల్లి సమీపంలో ఉన్న వెంకమ్మ చెరువు పూర్తిస్థాయిలో నిండి అలుగు పారితే వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో లోలెవల్ చప్టాను తొలగించి, దాని స్థానంలో హైలెవల్ వంతెన నిర్మించాలని స్థానికులు ఎన్నో ఏళ్లుగా మొరపెట్టుకుంటున్నారు. అయినా సరే అధికారులు, ప్రజాప్రతినిధుల్లో మాత్రం కనీసం చలనం లేదు. ప్రతీ ఏటా వర్షాకాలంలో వాగు కారణంగా చుట్టు పక్కల వారంతా అశ్వారావుపేటకు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. భారీ వర్షాలు కురిస్తే రెండు నుంచి మూడు రోజులపాటు లోలెవల్ చప్టా వరద నీటిలో మునిగిపోతుంది. దీంతో రాకపోకలకు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ హై లెవల్ వంతెన నిర్మిస్తేనే హైరానా తొలగిపోతుందని వారంతా చెబుతున్నారు.

చుట్టూ తిరిగి రావాల్సిందే..

వాగు ఉప్పొంగి, లో లెవల్ చప్టా నీటి మునిగితే ఇటు వైపుగా రాకపోకలు సాగించే వారంతా నానా ఇబ్బందులు పడుతున్నారు. చప్టా వరద నీటిలో ఉంటే మండలంలోని వాగొడ్డగూడెం, గంగారం కాలనీ, రామన్నగూడెం, దిబ్బగూడెం, పండువారిగూడెం, గాండ్లగూడెం, అనంతారం నుంచి రాకపోకలు సాగించే వారికి తిప్పలు వర్ణణాతీతంగా ఉన్నాయి. వాగు ఉధృతంగా ప్రవహించే సమయంలో ఆయా గ్రామాల వారంతా వాగొడ్డుగూడెం నుంచి వేదాంతపురం, ఊట్లపల్లి మీదుగా చుట్టూ తిరిగి అశ్వారావుపేటకు రావాల్సి వస్తుంది. దీంతో వాగొడ్డుగూడెం నుంచి అశ్వారావుపేటకు 4 కి.మీ. దూరం కాగా, వాగొడ్డుగూడెం నుంచి ఊట్లపల్లి మీదుగా అశ్వారావుపేటకు రావాలంటే 8 కి.మీ. దూరం ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో దూరాభారం అవుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాపాయం, అత్యవసరం సమయాల్లో అశ్వారావుపేటలోని ఆస్పత్రులకు వచ్చేందుకు పడే అవస్థలు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.

అవస్థలు తప్పడం లేదు



ప్రతీ ఏటా వర్షాకాలం వస్తే చాలు వాగొడ్డుగూడెం వాగు దగ్గర అవస్థలు తప్పడం లేదు. గతంలో నిర్మించిన లోలెవల్ చప్టా వాగు వరదలో నీట మునిగి రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో చుట్టూ తిరిగి అశ్వారావుపేటకు వెళ్లి రావాల్సి వస్తుంది. దూరప్రాంతాల నుంచి వచ్చే వారంతా వాగు పొంగితే ఇబ్బందులు పడుతున్నారు.

– కొర్సా అర్జమ్మ, వాగొడ్డుగూడెం

వంతెన నిర్మించాలి



వాగొడ్డుగూడెం వాగు దగ్గర హైలెవల్ వంతెన నిర్మించాలని చుట్టు పక్కల గ్రామస్తులు ఎన్నో ఏళ్ల కోరుతున్నారు. ఈ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టి వంతెన నిర్మించేలా కృషి చేస్తే ఎంతో మందికి ప్రయోజనం కలుగుతుంది.

– సాధు జోత్స్నబాయి, మాజీ సర్పంచ్, ఊట్లపల్లి

ప్రతిపాదనలు పంపిస్తాం..



వాగొడ్డుగూడెం గ్రామ శివారులో వాగు సమస్య తీవ్రంగానే ఉంది. హైలెవల్ వంతెన నిర్మించాలని ఇప్పటికే గుర్తించాం. గతంలో నిర్మించిన లోలెవల్ చప్టా కొద్దిపాటి వర్షాలకే నీట మునిగి రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. త్వరలోనే హైలెవల్ వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి, ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం.

– శ్రీధర్, డీఈఈ, పీఆర్, అశ్వారావుపేట

రక్షణ చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి



బూర్గంపాడు: నిరసనలో విద్యార్థులు, నాయకులు

బూర్గంపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా రక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి సున్నం భూలక్ష్మీ, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రణయ్‌కుమార్ అన్నారు. మహిళలపై లైంగిక దాడులు, హత్యలను నిరసిస్తు పీఓడబ్ల్యూ, పీడీఎస్‌యూల ఆధ్వర్యంలో శుక్రవారం సారపాకలో నిరసన ప్రదర్శన చేపట్టారు. నాయకులు రవి, కొడిమి రాధ, సోడె అచ్చమ్మ, కృపారాణి, వెంకటరమణ, వర్షా, కల్యాణి, నరేష్, అజిత్ పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ స్థానిక వ్యవసాయ కళాశాల విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది కలిసి ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రొఫెసర్లు ఎం.రాంప్రసాద్, మధుసూదన్ రెడ్డి, నాగాంజలి, రెడ్డి ప్రియా, ఆర్.రమేష్, శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.



అశ్వారావుపేటరూరల్: కొవ్వొత్తులతో ర్యాలీ..



అశ్వాపురంలో..

అశ్వాపురం: కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకుడు ఓరుగంటి రమేష్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, గాదె కేశవరెడ్డి, దోసపాటి పిచ్చేశ్వరరావు, కొర్లకుంట రాంబాబు, నాగేశ్వరరావు, అన్నపూర్ణ, సరిత ఉన్నారు.

పరిశుభ్రత పాటించాలి

దుమ్ముగూడెం : ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని డాక్టర్ పుల్లారెడ్డి సూచించారు. శుక్రవారం దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెద్ద ఆర్లగూడెంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటిని తిరిగి నిల్వ ఉన్న నీటిని పారబోశారు. అదేవిధంగా పెద్ద ఆర్లగూడెంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ల్యాబ్‌ను తనిఖీ చేసి వైద్య, ఆరోగ్య శాఖ నుంచి అనుమతి తెచ్చుకునే వరకు పరీక్షలు నిలిపివేయాలని ఆదేశించారు.



దుమ్ముగూడెం: నిల్వ నీరు పారబోస్తున్న సిబ్బంది

వైద్యశిబిరం

మణుగూరు రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శనగర్‌లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు నిశాంత్‌రావు గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులు పంపిణీ చేశారు. అనంతరం ప్రతీ ఇంటిని సందర్శించి పరిసరాలను పరిశీలించడంతో పాటు నీరు నిల్వ ఉన్న కంటైనర్లను శుభ్రం చేయించారు. వైద్యసిబ్బంది రాంప్రసాద్, వెంకటలక్ష్మీ, పూలకుమారి, అరుణ, ఎంఎల్‌హెచ్‌పీ హిమబిందు, నాగమణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మణుగూరు రూరల్: వైద్య శిబిరంలో పరీక్షలు

వరలక్ష్మీ వ్రతం



ములకలపల్లి: శిశుమందిర్‌లో ..

ములకలపల్లి: శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని మండలకేంద్రంలోని శిశుమందిర్ ఆవాస విద్యాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు చేశారు. భక్త ఆంజనేయ ఆలయ పూజారి ముకుందల సత్యనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ములకలపల్లికి చెందిన అనసూర్య అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రధానాచార్యులు జగన్, గాడి తిరుపతిరెడ్డి, పద్దం బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు రూరల్ : శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా మండల వ్యాప్తంగా మహిళా భక్తులు అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని సీహెచ్‌పీ ప్రాంతంలోని శ్రీకనకదుర్గ దేవి ఆలయంలో అమ్మవారు సౌభాగ్యలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సౌభాగ్యలక్ష్మీ అమ్మవారిని గాజులతో, పూలతో సుందరంగా అలంకరించారు.



మణుగూరు రూరల్: సౌభాగ్యలక్ష్మీ అవతారంలో అమ్మవారు

పొదెంకు సన్మానం

భద్రాచలంటౌన్: భద్రాచలం పర్యటనకు వచ్చిన రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్యను కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ సభ్యులు ఆయనను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మహిమద్ ఖాన్, అలీమ్, ఉస్మాన్, పాషా, సైరుద్దీన్, యాకుబ్ పాషా సాల్మన్, హుస్సేన్, ఆసిఫ్, ఆరిఫ్, మున్నా, ఆరిఫ్, బాబాజీ తదితరులు పాల్గొన్నారు

బదిలీపై వెళ్లిన కార్యదర్శికి ..

అశ్వారావుపేటరూరల్: బదిలీపై వెళ్లిన అశ్వారావుపేట మేజర్ పంచాయతీ కార్యదర్శి జిహరికృష్ణను శుక్రవారం స్థానిక రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ మేరకు అశ్వారావుపేట పంచాయతీ కార్యాలయంలో ఏఓను శాలువా కప్పి సన్మానించి, జ్ఞాపికలను అందించారు. కార్యదర్శి శ్రీ రామ్మూర్తి, సంఘం బాధ్యులు ఉక్కురి బుచ్చిబాబు, గుమ్మడి ఆదినారాయణ, అల్లాడి నారాయణ, గుమ్మడి అప్పన్న, గుమ్మడి శ్రీను, గాడిచర్ల శ్రీను, రాయల కృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల వినతులను పరిష్కరించాలి

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల బదిలీలలో నష్టపోయిన వివిధ కేటగిరీల ఉపాధ్యాయుల వినతులను పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు బుటారి రాజు, జిల్లా కార్యదర్శి బానోత్ బాలు, ఉపాధ్యాయదర్శిని సంపాదక వర్గ సభ్యులు మునిగడప రామాచారి పాల్గొన్నారు.

'ఓపెన్' ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోండి



మాట్లాడుతున్న లక్ష్మీ

అశ్వారావుపేటరూరల్: ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈఓ కీసరి లక్ష్మీ కోరారు. శుక్రవారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఓపెన్ స్కూల్‌కు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లు ప్రారంభించామని, ఆసక్తి ఉన్న వారు ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశాలకు సెప్టెంబర్ 8లోపు జరిమానా లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు సీహెచ్ వెంకయ్య, వీరేశ్వరావు, ప్రైవేటు స్కూళ్ల బాధ్యులు ప్రవీణ్, కొతారు చలపతి, పరబ్రహ్మాచారి పాల్గొన్నారు.

డ్రైవర్లు సామాజిక బాధ్యతతో మెలగాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మణుగూరు టౌన్: ఆటో డ్రైవర్లు సామాజిక బాధ్యతతో మెలుగుతూ విధిగా డ్రైవింగ్ లైసెన్సులు కలిగి విధులు నిర్వహించాలని మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మణుగూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఆటోలకు విధిగా ఇన్సూరెన్స్ చేయించాలని, యూనిఫాం ధరించి ప్రయాణికులతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. ఆటో డ్రైవర్ వివరాలు సీటు వెనుక ఉంచి ప్రయాణికులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా పట్టణంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా యథేచ్ఛగా ఆటో ఆపి ప్రయాణికులను ఎక్కించుకునే విధానాన్ని ఊరుకునేది లేదన్నారు. గంజాయి, నాటుసారా రవాణాలపై పోలీసులకు సమాచారం అందించి మెరుగైన సమాజ నిర్మాణానికి తమ వంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సతీష్‌కుమార్, ఎస్సై మేడ ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాకుంటే దరఖాస్తు చేసుకోవాలి



రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న ఏడీఏ రవికుమార్

అన్నపురెడ్డిపల్లి: రుణమాఫీ కాని రైతులు గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకోవాలని అశ్వారావుపేట ఏడీఏ రవికుమార్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌ను ఆయన పరిశీలించి, రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. గ్రీవెన్స్ ద్వారా దరఖాస్తు చేసుకున్న రైతుల వివరాలను ఏఓ అనూషను అడిగి తెలుసుకున్నారు. రైతులు గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రశాంత్ , రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ సమస్యల పరిష్కారానికి సహకారం



మాట్లాడుతున్న జీఎం రాంచందర్

మణుగూరు టౌన్: మాజీ సింగరేణీయుల సీఎంపీఎఫ్ సమస్యల పరిష్కారానికి సింగరేణి సహకారం అందిస్తుందని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అన్నారు. శుక్రవారం పీవీకాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో సీఎంపీఎఫ్ రీజనల్ కమిషనర్ కనకమ్మ, అధికారులు పెన్షన్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవగాహన లోపంతో పాటు వయసు ప్రభావం, దూర ప్రాంతాల్లో నివాసం తదితర కారణాలతో సరైన ధ్రువపత్రాలు అందించలేని వారిపై మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. రీజియన్ కమిషనర్ కనకమ్మ మాట్లాడుతూ... లబ్ధిదారుల సమస్యల సత్వర పరిష్కారానికి ఆన్‌లైన్ ద్వారా పెన్షనర్ల సమస్యలు పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపట్టామన్నారు. అనంతరం బొగ్గు గనుల భవిష్య నిధిపై ప్రత్యేక త్రైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రమేటవ్, చిరంజీవి, అవినాష్, సింగు శ్రీనివాసరావు, వై.రాంగోపాల్, కృష్ణంరాజు, సాయిల సురేశ్, సీఎంపీఎఫ్ సిబ్బంది సీతారాం, వెంకటేశ్వర్లు, జాన్‌వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు అవగాహన



సమావేశానికి హాజరైన అధికారులు, బీఎల్‌ఓలు

అన్నపురెడ్డిపల్లి: స్థానిక తహసీల్‌లో తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్ శుక్రవారం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. బీఎల్‌ఓకు బీఎల్ఓ యాప్‌లో హౌస్‌టూహౌస్ సర్వే, ఓటర్ వివరాల నమోదు చేయటం, ఓటు సవరణ, తొలగింపు, కొత్త ఓటర్ నమోదుపై అవగాహన కల్పించారు. తప్పు లేకుండా ఓటర్ జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మధు, సిబ్బంది, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

రైతులపై అధికారుల తీరు మారాలి



మాట్లాడుతున్న నాయకులు

దుమ్ముగూడెం: రైతులపై బ్యాంకు అధికారుల తీరు మారాలని ఏఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఓ కార్యాలయానికి ఆదివాసీ రైతుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం డివిజన్ అధ్యక్షుడు సోందె మల్లూరు, కన్వీనర్ రేసు ఆదినారాయణమూర్తి మాట్లాడుతూ.. రుణమాఫీ అయిన రైతులను బ్యాంకు అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, నర్సాపురం బ్యాంకు మేనేజరు హీనంగా మాట్లాడుతూ రైతులను మనస్తాపానికి గురి చేస్తున్నారన్నారు. అర్హత గల రైతులందరికీ తక్షణం రుణాలు మంజూరు చేసి సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూరంబొర్రయ్య, కారం గోపాలరావు, కల్లూరి రామచిట్టి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా క్రమబద్ధీకరణ



జాబితాను క్రమబద్ధీకరిస్తున్న సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాలతో పంచాయతీల్లో ఓటరు జాబితా క్రమబద్ధీకరణ కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి ప్రారంభించారు. ఈ మేరకు స్థానిక తహసీల్‌లో పంచాయతీ సిబ్బంది ఓటరు లిస్టులను పరిశీలించి క్రమబద్ధీకరణ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, కార్యదర్శులు, బీఎల్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

కోనో కార్పస్ మొక్కల తొలగింపు



మొక్కలు తొలగిస్తున్న సిబ్బంది

గుండాల: కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ప్రధాన రహదారి వెంట ఉన్న కోనో కార్పస్ మొక్కలను పంచాయతీ సిబ్బంది శుక్రవారం తొలగించారు. మండల పంచాయతీ అధికారి శ్యాంసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు తొలగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

రోడ్డెక్కిన మురుగునీరు..



మండల కేంద్రంలో జగదాంబ స్వీట్స్ షాప్ నుంచి జిల్లా పరిషత్ హై స్కూల్ రహదారి ఇరువైపులా డ్రెయినేజీ లేక వర్షపు నీరు, మురుగునీరు రహదారిపై ప్రవహిస్తోంది. భారీ వర్షం కురిస్తే రోడ్డుపై నీరు భారీగా ప్రవహించి పాఠశాల విద్యార్థులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తాచెదారం పేరుకు పోయి విష జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ నిర్మించాలని తాత్కాలికంగానైనా తక్షణమై సైడ్ కాలువలు తీయాలని స్థానికులు కోరుతున్నారు.

– అశ్వాపురం

ప్రశ్నించాల్సిన అధికారి : డి.మల్లేశం, పంచాయతీ కార్యదర్శి, అశ్వాపురం, 8985424810